

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 294 పేజీలు - 08 వెల - 05/-

మంగళవారం 20-10-2026


# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి!



- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి

సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు.

పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ-ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని,

మిగతా 2లో

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల!

- ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల
- నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- మొత్తం 659 జెడ్పీటీసీ, 9829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ




ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నోటిఫికేషన్‌తో రాష్ట్రంలో మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లయింది.

మిగతాది 2లో

# టైగర్ ప్రూఫ్‌పై కాల్పులు.. ముగ్గురు నిందితుల అరెస్ట్

- రాజస్థాన్‌లోని కోట రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న పోలీసులు
- దాడికి 20 రోజుల ముందే ముంబైకి వచ్చి రెక్కీ నిర్వహించినట్లు వెల్లడి
- లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలపై పోలీసుల దర్యాప్తు
- నేపాల్‌కు పారిపోయేందుకు నిందితులు పథకం రచించినట్లు గుర్తింపు



మిగతాది 2లో

# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు..

- శాంతి ప్రయత్నాలకు క్షిపణులే రష్యా సమాధానమన్న జెలెన్స్కీ
- రష్యా దాడికి తాము ఎదురుదాడి చేయాల్సి వస్తోందని వెల్లడి
- మిత్ర దేశాల నుంచి క్షిపణి హెచ్చరికలు అందలేదన్న ఉక్రెయిన్



యుద్ధాన్ని ముగించేందుకు తాము దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా మాత్రం దాడులతోనే సమాధానమిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతాది 2లో






# రోడ్డును దున్నేసినందుకు సిగ్గుపడాలి



- పుల్లంపేట మండలంలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేశారని ఆరోపణ
- వైసీపీ నేతలే ట్రాక్టర్‌తో రోడ్డును తవ్వేశారన్న మంత్రి నారా లోకేశ్
- రూ.4.75 కోట్లతో నిర్మించిన రోడ్డు అని వెల్లడి
- ఇది కక్షపూరిత చర్య అని, ప్రజలపై దాడి అని తీవ్ర ఆగ్రహం

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో దారుణమైన ఘటన చోటుచేసుకుందని, వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యలకు ఇది నిదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజల కోసం రూ.4.75 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును, వేసిన నాలుగు రోజులకే వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్య దిగ్భ్రాంతికరమని, సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు.

మిగతాది 2లో

'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

# రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే సదస్సు

- భారత్ ఫ్యూచర్ సిటీని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0 ఏర్పాట్లపై సమీక్ష
- నవంబర్ 15 నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- వచ్చే ఏడాది జూన్ నాటికి రతన్ టాటా రేడియల్ రోడ్డు ప్రారంభం లక్ష్యం
- పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లుండాలని సూచన



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో పర్యటించి, పలు అభివృద్ధి పనులపై కీలక ఆదేశాలు జారీ చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే కార్మికుల సంఖ్యను పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మిగతాది 2లో

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు..

- మహేశ్ గౌడ్, పొంగులేటి, వంశీకృష్ణకు బీఆర్ఎస్ నోటీసులు
- నోటీసులు జారీ చేసిన సోమ భరత్ కుమార్
- సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్
- తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని సూచన
- స్పందించకపోతే పరువు నష్టం సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది




# కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత..

- నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలని కవిత డిమాండ్
- లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిక
- మేడిగడ్డను చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచన




తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మిగతాది 2లో

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని, ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

**చెప్పాం.. చేస్తున్నాం..**

2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ**

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు.
గొడ్డలి పార్టీ అధ్యక్షుడు తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్-జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్-జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు.
గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ స్పష్టం చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో 663 జెడ్పీటీసీలు, 9,859 ఎంపీటీసీలు ఉండగా, కొన్ని కారణాల వల్ల మిగిలిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. మొత్తంగా 10,488 స్థానాలకు ఈ ఎన్నికల ప్రక్రియ జరగనుంది.
ఎన్నికల ప్రచార ఖర్చుపై కూడా కమిషన్ స్పష్టతనిచ్చింది. జెడ్పీటీసీ అభ్యర్థి గరిష్ఠంగా రూ.8 లక్షల వరకు, ఎంపీటీసీ అభ్యర్థి రూ.4 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని పునేఠా వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం 687 మందిని ఎంపీటీసీలకు, 28 మందిని జెడ్పీటీసీలకు రిటర్నింగ్ అధికారులు (ఆర్వో)గా నియమించినట్లు తెలిపారు.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు**

ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఈ నెల అక్టోబర్ 21న రిటర్నింగ్ అధికారులు ఆయా స్థానాలకు ఎన్నికల ప్రకటన జారీ చేస్తారు. అదే రోజు ఓటర్ల జాబితాను కూడా ప్రదర్శిస్తారు.
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు.
పరిశీలన, అప్పీళ్లు: అక్టోబర్ 24న నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థులు అప్పీలు చేసుకునేందుకు అక్టోబర్ 25 వరకు గడువు ఉంటుంది. ఎంపీటీసీ అభ్యర్థులు ఆర్డీఓకు, జెడ్పీటీసీ అభ్యర్థులు జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 26న ఈ అప్పీళ్లపై తుది నిర్ణయం తీసుకుంటారు.
ఉపసంహరణ, తుది జాబితా: అక్టోబర్ 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.
పోలింగ్, లెక్కింపు: నవంబర్ 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఏవైనా కారణాలతో పోలింగ్ నిలిచిపోతే, అవసరమైన చోట నవంబర్ 4న రీ-పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు.
ఈ షెడ్యూల్ ప్రకటనతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించాయి.

### 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..

# రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే సదస్సు

డిసెంబర్ 7 నుంచి 9 వరకు 'భారత్ ఫ్యూచర్ సిటీ' వేదికగా జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. 'మీ పెట్టుబడులు మాతో సురక్షితం' అనే భరోసాతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌ను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించనున్నందున, యూనివర్సిటీ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి, సదస్సు ఏర్పాట్లపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు.
ఈ సదస్సును అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని, దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలను ఆకర్షించేలా ఏర్పాట్లు ఉండాలని సీఎం సూచించారు. నవంబర్ 15 నాటికి ఓపెన్ ప్రమిసెస్ పనులు, నవంబర్ చివరి నాటికి సమ్మిట్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని గడువు విధించారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించారు.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' కేవలం ఒక వ్యాపార సదస్సు మాత్రమే కాదని, ఇది తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే ఒక చరిత్రాత్మక వేదిక అని ఉద్ఘాటించారు. సదస్సు విజయవంతం కోసం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి ఇబ్రహీంపట్నంలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించారు. అనంతరం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ ప్రాంగణంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (నిమ్) క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు.
ఈ కార్యక్రమాల్లో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.

యుద్ధాన్ని ముగించేందుకు తాము దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా మాత్రం దాడులతోనే సమాధానమిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోసం వచ్చిన ప్రతి ప్రతిపాదనకు తాము సానుకూలంగా స్పందించామని, కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు.
రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.
"మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు.
గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.



# షైదుబాయ్ ఘటన: ప్లంబర్ కథనంపై స్పందించిన భారత పైలట్ స్మిత్ మచ్చర్

తీవ్ర ప్రమాదం నుంచి షైదుబాయ్ విమానాన్ని ఓ ప్లంబర్ తన సమయస్ఫూర్తితో కాపాడారంటూ వస్తున్న వార్తలను ఆ విమాన పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందించారు. ఆ ప్లంబర్ గురించి తనకు కనీస సమాచారం కూడా లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం యూఏఈలో చికిత్స పొందుతూ కోలుకుంటున్న పైలట్ స్మిత్, అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.
ఇటీవల షైదుబాయ్ విమానంలో ఎమర్జెన్సీ తలెత్తిన సమయంలో, ప్రయాణికుడిగా ఉన్న యానివ్ హయూన్ అనే ప్లంబర్ తన సాహసంతో ప్రమాదాన్ని నివారించినట్లు వార్తలు వచ్చాయి. 'ఎయిర్ క్రాష్ ఇన్వెస్టిగేషన్' అనే టీవీ షోలో చూసిన అంశాలను ఆధారంగా చేసుకుని, కంట్రోల్ స్టిక్స్‌ను వెనక్కి లాగి విమానాన్ని స్థిరపరిచానని హయూన్ గతంలో పేర్కొన్నారు. అనంతరం విధుల్లో లేని మరో పైలట్ సహాయంతో విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు వివరించడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది.
ఈ కథనాలపై కెప్టెన్ స్మిత్ మచ్చర్ స్పందిస్తూ, "నిజం చెప్పాలంటే ఆ ప్లంబర్ ఉదంతం గురించి నాకేమీ తెలియదు. విమానంపై ఆకస్మిక దాడి జరిగినప్పుడు, అది కూలిపోకుండా కాపాడేందుకే నేను సర్వశక్తులు ఒడ్డాను. నన్ను నేను రక్షించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించాను" అని వెల్లడించారు. విమానం కెప్టెన్ నియంత్రణలోనే ఉందంటూ ఓ సీనియర్ అధికారి చెప్పిన మాటలు మాత్రమే తనకు గుర్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఒక ప్లంబర్ విమానాన్ని ల్యాండ్ చేయగలడా అనే ఊహాగానాలపై తాను స్పందించబోనని ఆయన స్పష్టం చేశారు.
దాడి జరిగిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు తనకు పూర్తిగా గుర్తులేవని కెప్టెన్ స్మిత్ వివరించారు. తీవ్రమైన దాడి జరుగుతున్నప్పటికీ, ఎంతో శ్రమించి తన సీట్ బెల్ట్ విప్పుకుని కాక్‌పిట్ తలుపులు తెరిచినట్లు ఆయన గుర్తు చేసుకున్నారు.

# రోడ్డును దున్నేసినందుకు సిగ్గుపడాలి

పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం, పాపక్కగారిపల్లె గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డును నిర్మించామని లోకేశ్ తెలిపారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించి రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్థులు సంతోషంగా ఉన్నారని, కానీ వారి ఆనందాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. "ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం రాజకీయం అనిపించుకోదు. ఇది కచ్చితంగా ప్రజలపై జరిగిన అహంకారపూరిత దాడి. కక్ష సాధింపు చర్యలతో ప్రజాధనాన్ని ఇలా నాశనం చేయడం అత్యంత హేయమైన చర్య" అని లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆయన కోరారు. ధ్వంసమైన రోడ్డును వీలైనంత త్వరగా పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అరాచక చర్యలను ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం నిందితులకు శిక్ష పడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

## కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత..

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు..

ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది. తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది. నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

### టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు..

# ముగ్గురు నిందితుల అరెస్ట్

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను రాజస్థాన్‌లోని కోట రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశారు. దాడికి దాదాపు 20 రోజుల ముందే నిందితులు ముంబైకి చేరుకొని, పక్కా ప్రణాళికతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వారం రోజుల క్రితం టైగర్ ష్రాఫ్ ఆడుకుంటున్న ఫుట్‌బాల్ మైదానం వద్దకు వెళ్లి రెక్కీ కూడా నిర్వహించినట్లు గుర్తించారు. అరెస్టయిన వారిలో హర్యానాకు చెందిన



ఫుల్‌సింగ్ నరేశ్, రెహాన్ రషీద్దీన్‌తో పాటు ముంబైలో నివసిస్తున్న హృతిక్ అనే రాపిడో డ్రైవర్ ఉన్నారు. వీరిలో హృతిక్ బైక్ నడపగా, మిగిలిన ఇద్దరు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 11న వీరు ఒక మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేసినట్లు కూడా విచారణలో వెల్లడైంది. కాల్పుల అనంతరం పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ముందుగా బైక్‌పై అంధేరీ రైల్వే స్టేషన్‌కు వెళ్లి, అక్కడి నుంచి లోకల్ ట్రైన్‌లో కాందివలీకి చేరుకున్నారు. ఆ తర్వాత క్యాబ్ బుక్ చేసుకొని సూరత్‌కు పారిపోయారు. అక్కడి నుంచి కోటా వెళుతున్న పుణే-జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కగా, పక్కా సమాచారంతో కోటా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కోటా ఎస్పీ తేజస్విని గౌతమ్ ప్రకారం, కేవలం 15 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసి నిందితులను పట్టుకున్నారు. తొలుత ఢిల్లీ వెళ్లి, అక్కడి నుంచి నేపాల్‌కు పారిపోవాలని నిందితులు పథకం రచించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. నిందితుల్లో ఒకడైన రెహాన్‌కు, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న అనిల్ పండిట్‌తో పరిచయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుల నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే, కాల్పులకు ఉపయోగించిన ఆయుధాన్ని ఇంకా గుర్తించాల్సి ఉంది. గత ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ముంబైలోని జుహూ ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ ఫుట్‌బాల్ మైదానం నుంచి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ స్వల్ప గాయాలతో బయటపడగా, డ్రైవర్ సహా మరొకరు గాయపడ్డారు. నిందితులను కస్టడీలోకి తీసుకునేందుకు ముంబై పోలీసుల బృందం కోటాకు చేరుకుంది. దాడి వెనుక అసలు కారణాలు తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతోంది.

# చౌడేశ్వరి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సతీమణి కాటసాని జయమ్మ



బనగానపల్లె, అక్టోబర్ 19,పల్లెవెలుగు మండలం లోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ గా,కాటసాని ప్రతిభా రెడ్డి గారు

# ఎంపీడీవో నాగేంద్ర పరామర్శించిన బిసి రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబర్ 19, పల్లెవెలుగు ఆత్మకూరు ఎంపీడీవో నాగేంద్రను బనగానపల్లె



పట్టణ మాజీ సర్పంచ్ , అరుణ భారతి సాంస్కృతి సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి సోమవారం పరామర్శించారు. నాగేంద్ర ఇటీవల కర్నూల్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బిసి రాజారెడ్డి నంద్యాల మండలం కానాల గ్రామానికి వెళ్లి నాగేంద్ర ను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో నాగేంద్ర బనగానపల్లె మేజర్ గ్రామపంచాయతీ ఈఓగా పని చేశారు. ఆ సమయంలో పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించారు. అప్పటి నుండి బిసి రాజారెడ్డి తో నాగేంద్రకు ఆత్మీయ అనుబంధం ఉంది. నాగేంద్ర , కుటుంబ సభ్యులకు భవిష్యత్తులో అన్ని విధాలుగా అండగా ఉంటామని బిసి రాజారెడ్డి భరోసా ఇచ్చారు

# నియోజకవర్గంలో అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయం- మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబర్ 19,పల్లెవెలుగు స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో అన్ని



స్థానాల్లో కూటమి అభ్యర్థులదే విజయమని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని కాపులపల్లె ఫామ్‌హౌస్‌లో పట్టణానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలతో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై వార్డుల వారీగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవలేక అల్లర్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ నామినేషన్ సందర్భంగా వైసీపీ నేతలు చేసిన అల్లర్లను ప్రస్తావిస్తూ మండిపడ్డారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రతిపక్ష పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ విజయానికి బలమని ధీమా వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయి పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలు, ప్రజల మద్దతుపై నాయకులు, కార్యకర్తలతో సమాలోచనలు జరిపారు. పార్టీ విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని, అభ్యర్థుల ఎంపికలో స్థానిక పరిస్థితులు, ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ కృష్ణ యాదవ్,జిల్లా కార్యదర్శి శరత్ చంద్ర,బీజేపీ బనగానపల్లె మండల రూరల్ అధ్యక్షులు హరి కృష్ణ గౌడ్,మండల కార్యదర్శి సుదర్శన్,పట్టణ అధ్యక్షులు యాదగిరి, పట్టణ మాజీ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, భానుముక్కల సహకార సంఘం అధ్యక్షులు అత్తార్ అబ్దుల్ కలాం టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు అత్తార్ అను ఎర్రబోలు పవన్ కుమార్ రెడ్డి కొంగని పవన్ కుమార్ యాదవ్, నియోజకవర్గం బీజేపీ నాయకులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రిసెప్షన్ సెంటర్ , స్ట్రాంగ్ రూమ్ , కౌంటింగ్ హాల్ ను పరిశీలించిన ఆర్డీవో



బనగానపల్లె , అక్టోబర్ 19, పల్లెవెలుగు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రిసెప్షన్ సెంటర్ , స్ట్రాంగ్ రూమ్ , కౌంటింగ్ హాల్ లను ఆర్డీవో ఆర్డిఓ నరేంద్ర నాథ్ రెడ్డి, అధికారులు పరిశీలించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి రిసెప్షన్ సెంటర్ , స్ట్రాంగ్ రూమ్ , కౌంటింగ్ హాళ్లను ఆర్డిఓ వై నరేంద్ర నాథ్ రెడ్డి, పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో బనగానపల్లె మండల ఎన్నికల అధికారి మండలం సుధాకర్, ఎంపీడీవో నాగరాజు, తాసిల్దార్ చంద్రశేఖర్, గ్రామపంచాయతీ ఈవో మురళీమోహన్ పాల్గొన్నారు.

# జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

**అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలి.**
**నామినేషన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి, అక్కడ చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి రిటర్నింగ్ అధికారి , అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు , హెల్ప్ డెస్క్ సిబ్బంది కూర్చునే ప్రదేశాలను స్పష్టంగా నిర్దేశించి, విధుల నిర్వహణలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా చూడాలని సూచించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులు వేచి ఉండేందుకు తగిన స్థలాన్ని ఏర్పాటు చేయాలని, కేంద్రం వద్ద రద్దీ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధికి వెలుపల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసి, ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సంబంధిత అధికారులు సమన్వయంతో నిర్వహించాలని, బాధ్యతలు అప్పగించిన అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ కేంద్రంలో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎస్డిపిఓ సుస్మిత, జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను పాటించాలి





బనగానపల్లె, అక్టోబర్ 19, పల్లెవెలుగు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని స్థానిక సంస్థల ఎన్నికల అధికారి సుధాకర్, ఎన్నికల అసిస్టెంట్ అధికారి, తహసిల్దార్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారి సుధాకర్, ఎన్నికల అసిస్టెంట్ అధికారి తహసిల్దార్ చంద్రశేఖర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నామినేషన్ల దాఖలు, ఎన్నికల ప్రక్రియ, తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలపై పార్టీలకు వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు ఇద్దరు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. నామినేషన్ కేంద్రం చుట్టూ అధిక సంఖ్యలో కార్యకర్తలు, వాహనాలు రాకూడదని, ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలు దెబ్బతినకుండా పార్టీ నాయకులు జాగ్రత్త వహించాలని సూచించారు. నామినేషన్ పత్రాన్ని అభ్యర్థి, ప్రతిపాదకుడు వ్యక్తిగతంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈనెల 21 నుండి 23 వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నామినేషన్లు తీసుకుంటామని ,ఆలస్యంగా వస్తే నామినేషన్ స్వీకరించమని తెలిపారు. 24వ తేదీ నామినేషన్ల పరిశీలన, 25 తిరస్కరణ పై అప్పిలు, 27న విత్ డ్రా, అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు .నవంబర్ 3న ఎన్నికలు, 4న రీపోలింగ్, 5 న కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండం మల్లికార్జున రెడ్డి, హరి, వల్లెపు శంకర్, వైసిపి నాయకులు సన్నాల జనార్దన్ రెడ్డి ,బండి బ్రహ్మానందరెడ్డి ,అనిల్, సిపిఎం నాయకులు సుబ్బయ్య, బిజెపి నాయకులు శివ కృష్ణ యాదవ్, బచ్చు శరత్ చంద్ర, సిపిఐ నాయకులు శివయ్య, సుబ్బారెడ్డి, జనసేన నాయకులు భాస్కర్, షేక్షావలి, బిఎస్పి నాయకులు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ రౌడీజం చేస్తే భయపడను.

**● మా అభ్యర్థులపై దాడులను సహించేది లేదు. ● తాడేపల్లి ఫ్యాలెస్ ఆదేశాలతోనే ఎన్నికల్లో వైసీపీ దాడులు. ● మీ తాటాకు చప్పుళ్లకు టీడీపీ భయపడదు. ● నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలో ఇప్పటివరకు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని, అయితే సోమవారం నామినేషన్ల పరిశీలన సమయంలో తమ అభ్యర్థిపై దాడి జరగడం బాధాకరమని, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

సోమవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పరిణామాలపై ఆమె తీవ్ర అభ్యంతరం, ఆగ్రహం వ్యక్తం చేశారు.

నామినేషన్ల పరిశీలన సమయంలో వైసీపీ నాయకులు కొందరిని లోపలికి తీసుకువచ్చి టీడీపీ అభ్యర్థుల నామినేషన్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తాము కూడా వైసీపీ అభ్యర్థులపై అభ్యంతరాలు వ్యక్తం చేయగలమని, అయితే ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలనే ఉద్దేశంతో సంయమనం పాటించామని తెలిపారు.

రౌడీయిజానికి భయపడే వాళ్లం కాదు.

గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని తాము భావించామని, అయినప్పటికీ తమ అభ్యర్థిపై దాడి జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆరోపించారు.

రౌడీయిజం చేస్తే భయపడతామని ఎవరూ




అనుకోవద్దని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోవాలని స్పష్టం చేశారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తనపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని ఆమె గుర్తుచేశారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంయమనం పాటిస్తూ, ఎన్నికలు న్యాయబద్ధంగా జరగాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

తాడేపల్లి ఫ్యాలెస్ ఆదేశాలతోనే వైసీపీ ఎన్నికల్లో అల్లర్లు, దాడులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు.

మహిళలు, అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నాం

మహిళలపైనా, కౌన్సిలర్ అభ్యర్థులపైనా దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని ఆమె అన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నప్పుడు బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే నిబంధనల ప్రకారం, నిష్పక్షపాతంగా పోటీ చేయాలని సూచించారు.నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారనే ధీమాను ఆమె వ్యక్తం చేశారు. తమ పార్టీ కార్యకర్తలు, అభ్యర్థులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హెచ్చరించారు.

# పాణ్యంలో కూటమి అభివృద్ధే శ్రీరామరక్ష: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

- కల్లూరు 22 వార్డుల అభ్యర్థులకు 'బీ-ఫారాలు' అందజేత
- రూ.400 కోట్లతో నియోజకవర్గ రూపురేఖలు మార్చాం
- గత వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పాణ్యం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయ తీరాలకు చేరుస్తాయని స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కర్నూలులోని మాధవీ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎన్నికల సందడి నెలకొంది. ఈ సందర్భంగా కల్లూరు పరిధిలోని 22 వార్డులకు సంబంధించి కూటమి బలపరిచిన అభ్యర్థులకు ఆమె అధికారికంగా 'బీ-ఫారం' పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

అభివృద్ధికి చిరునామా కూటమి పాలన:
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండున్నరేళ్ల స్వల్ప కాలంలోనే పాణ్యం నియోజకవర్గ రూపురేఖలను సమూలంగా మార్చివేశామని ఎమ్మెల్యే చరితారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి దాదాపు రూ. 400 కోట్ల నిధులు వెచ్చించామని, కేవలం కల్లూరులోని 22 వార్డుల మౌలిక వసతుల కల్పన కోసమే ప్రత్యేకంగా రూ. 110 కోట్లతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించారు. దశాబ్దాలుగా ప్రజలను వేధిస్తున్న తాగునీటి ఎద్దడిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన జలాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై ధ్వజం:
గత వైకాపా ఐదేళ్ల పాలనలో పాణ్యం అభివృద్ధి పూర్తిగా తిరోగమనంలో పడిపోయిందని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సమస్యలను గాలికొదిలేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పారదర్శక పాలన, స్థానికంగా జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని, రాబోయే స్థానిక పోరులో కూటమి అభ్యర్థుల విజయం ఏకపక్షం కాబోతోందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అభ్యర్థులంతా ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించి భారీ మెజారిటీ సాధించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నేతలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 41వ వార్డు తెదేపా అభ్యర్థి పూల శివశంకర్‌కు 'బీ-ఫాం' అందజేత

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరపాలక సంస్థ (కేఎంసీ) పరిధిలోని 41వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా పూల శివశంకర్‌కు అధికారికంగా పార్టీ 'బీ-ఫాం'



అందింది. పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరితారెడ్డి, ప్రముఖ నేత గౌరు వెంకటరెడ్డి (జనార్దన్‌రెడ్డి) సమక్షంలో సోమవారం అరోరా నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది.
పార్టీ సీనియర్ నేత శేఖర్ చౌదరి ఆధ్వర్యంలో 41వ వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీగా కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి పూల శివశంకర్‌కు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పార్టీ బీ-ఫాం పత్రాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలుపుతూ విజయతీరాలకు చేరాలని ఆశీర్వదించారు. వార్డులోని ప్రతి గడపకూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని చేరవేసి భారీ మెజారిటీ సాధించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల ఐక్యతే పార్టీ బలమని, వార్డులో తిరుగులేని విజయం సాధించి పసుపు జెండాను ఎగురవేయాలని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కురపాటి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, ప్రముఖ నేత గుమ్మళ్ళ అయ్యపురెడ్డి, కల్లూరు సింగిల్ విండో డైరెక్టర్ అంగడి లక్ష్మన్న యాదవ్, తెదేపా నాయకులు కురువ ఎల్లప్ప, నాగరాజు, జింగిరి వెంకటేశ్వర్లు, టేక్ నాయుడు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వార్డు అభ్యర్థిగా పూల శివశంకర్ ఎంపిక పట్ల స్థానిక శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

# బ్యాలెట్ పత్రాల ముద్రణకు పకడ్బందీ ఏర్పాట్లు

- మేయర్, కార్పొరేటర్ల అభ్యర్థుల ఎన్నికలకు 10 లక్షల బ్యాలెట్ పేపర్ల ముద్రణ
- బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదు
- భద్రత, గోప్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- ప్రింటింగ్ ప్రెస్ సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు, బారికేడ్లు
- అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పత్రాల ముద్రణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లోని ప్రింటింగ్ ప్రెస్‌లను పరిశీలించారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులకు సంబంధించి మొత్తం 10 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 4,79,861 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ప్రతి ఓటరు మేయర్ అభ్యర్థికి ఓటు వేసేందుకు ఒక బ్యాలెట్ పత్రం, కార్పొరేటర్ అభ్యర్థికి ఓటు వేసేందుకు మరో బ్యాలెట్ పత్రం వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీటికి అదనంగా పోలింగ్ కేంద్రాల్లో 10 శాతం బ్యాలెట్ పత్రాలను అందుబాటులో ఉంచాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 10 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ముద్రణ ప్రక్రియలో పూర్తి గోప్యత పాటిస్తూ, బ్యాలెట్ పత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాల వద్ద అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆఖరి బ్యాలెట్ పత్రం ముద్రణ పూర్తయ్యే వరకు నిర్విరామంగా ముద్రణ ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. ముద్రించిన బ్యాలెట్ పత్రాల లెక్కింపు, భద్రపరచడం, తరలింపు ప్రక్రియలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా అథెనా స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్‌కు ముందు రోజు ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు అవసరమైన రిసెప్షన్ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, ఎస్ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీసీపీ శబ్నం శాస్త్రీ, కార్యదర్శి నాగరాజు, ఆర్వో వాజిద్, డీఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, శ్రీనివాసన్, ఎలక్ట్రికల్ సూపర్వైజర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మం, సత్యం, విజయానికి ప్రతీక విజయదశమి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి-మంత్రి బీసీ




బనగానపల్లె, అక్టోబర్ 19, పల్లెవెలుగు ధర్మం, సత్యం, విజయానికి ప్రతీక విజయదశమి పండుగ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు, బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆశలు, ఆనందాలు, విజయాలను నింపాలన్నారు. దసరా పండుగ ప్రజల్లో భక్తిభావాన్ని, కుటుంబాల్లో ఆనందాన్ని, సమాజంలో ఐక్యతను పెంపొందించే పవిత్ర పర్వదినమని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని, ప్రజలందరికీ విజయాలు చేకూరాలని మంత్రి ఆకాంక్షించారు.

# ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ వివరాలు నోటీస్ బోర్డ్ పై ప్రదర్శన

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలంలో




త్వరలో నిర్వహించనున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల షెడ్యూల్ వివరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డుపై సోమవారం అధికారులు ప్రదర్శించారు. ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని ప్రజలు ఓటర్లు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమాచారం కొరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మండల ప్రత్యేక అధికారి ఏడిఏ మనోరంజన్ ప్రతాప్, ఎన్నికల అధికారి ఎంపీడీవో భాగ్యలక్ష్మి డిప్యూటీ ఎంపీడీవోలు ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ షెడ్యూల్ వివరాలను నోటీసు బోర్డు పై అతికించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి చే ఎంపీటీసీ జడ్పిటిసి ఓటర్ల జాబితాను ఈనెల 21 తేదీ ప్రదర్శించడం జరుగుతుందని అదే రోజు నుండి ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ 23వ తేదీ సాయంత్రం 5:00 వరకు ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు. 24వ తేదీ (ఉదయం 8 గంటల నుండి) నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 25వ తేదీ తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, ఎంపీటీసీల కొరకు ఆర్డిఓ కు, జడ్పిటిసి లకు జిల్లా కలెక్టర్కు అప్పీలు చేసుకుని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. 26వ తేదీ అప్పిలేట్ అధికారిచే అప్పిల పరిష్కారం ఉంటుందన్నారు. 27వ తేదీ అభ్యర్థుల ఉపసంహరణ మధ్యాహ్నం 3 గంటల లోపుగా ఉంటుందని, అలాగే అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీ చేయు అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. నవంబర్ 3 ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహణ ఉంటుందన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్ ఉన్నట్లయితే నాలుగో తేదీ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5వ తేదీ ఓట్ల లెక్కింపు ఉంటుందని లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల నిర్వహణ సందర్భంలో రుద్రవరం మండల పరిధిలోని ప్రజలు పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ ఎన్నికల షెడ్యూల్ మరియు నిబంధనలను గమనించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎన్నికల అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

# కర్నూలు జిల్లా ప్రజలకు, మీడియా కు, పోలీసు అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన...

- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్
- ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్
- కర్నూలు పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ.
- దుర్గా దేవికి , పోలీసులు వినియోగించే అన్ని రకాల తుపాకులకు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ... జిల్లా ఎస్పీ దంపతులు

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కర్నూలు ఎస్పీ



విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ , ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్ జిల్లా ప్రజలకు, మీడియా కు, పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆయుధ పూజలో ఎస్పీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు ఆయుధాగారంలో పోలీసులు వినియోగించే ప్రతి ఆయుధాన్ని అలంకరించారు. దుర్గాదేవి చిత్రపటానికి, జమ్మిచెట్టుకు, పోలీసు ఆయుధాలకు, పోలీసు వాహనాలకు పూజలు చేశారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయం చేకూర్చాలని, ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, పోలీస్ వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి , సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్లకు సిద్ధం కండి

## -ఎమ్మెల్యే బుడ్డా ఆదేశం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 18: ఎంపిటిసి అభ్యర్థి స్థానాలకు నామినేషన్ వేసేందుకు పార్టీ శ్రేణులు అందరూ సిద్ధం కావాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం రాత్రి బుడ్డా స్వగ్రామమైన వేల్పనూరులో పార్టీ కార్యకర్తలతో నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం రాత్రి 9 గంటల నుండి అర్ధరాత్రి 12 వరకు పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. గ్రామాల వారిగా ఒక్కొక్కరిని పిలిపించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాలలో ఉత్సాహం ఉన్న ప్రతి నాయకులు ఎంపీటీసీ అభ్యర్థిత్వానికి నామినేషన్ వేసి తీరాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. గ్రామాలలో ఏదైనా సమస్యలు ఉంటే అందరూ కూర్చొని పరిష్కరించుకొని ఏకాభిప్రాయానికి రావాలని పేర్కొనట్లుగా తెలుస్తోంది. జడ్పిటిసి సభ్యత్వానికి సంబంధించి కూడా చర్చ జరుగుతుందని అందరు ఊహించారు. ఇప్పటికే మండలంలో 8 మంది ఆశావాహులు పోటీ చేసేందుకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అయితే జడ్పిటిసి సభ్యత్వానికి ఇతర ప్రాంతాల నుండి నాయకులు పోటీ చేసే అవకాశం ఉంటుందని ప్రచారం జరుగుతూ ఉంది. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని జడ్పిటిసి అభ్యర్థిత్వంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. జిల్లాలోని ఓ మంత్రి కి సంబంధించిన సమీప బంధువు ఈ ప్రాంతంలో పోటీ చేస్తారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. బండి ఆత్మకూరు కానీ వెలుగోడు మండలం నుంచి కానీ ఇతర ప్రాంత నాయకులు పోటీ చేసే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతూ ఉంది.

# కుటుంబ సమేతంగా

## అమ్మవారిని దర్శించుకున్న మంత్రి టీజీ భరత్



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ కుటుంబ సమేతంగా కర్నూలులోని చిన్న అమ్మవారి శాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్లూరులోని అమ్మవారిశాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రి టీజీ భరత్‌ను ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

## వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకి సేవ మహోత్సవం



బనగానపల్లె , అక్టోబర్ 19, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రదోషకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వణ అధికారి పాండురంగారెడ్డి , ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వరరెడ్డి ,పాతపాడు మాజీ సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి , పాలకమండలి సభ్యులు తలారి తిరుమలయ్య, జక్కుల సురేష్ ,భరతుడు ,అర్చకులు ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిషాసుర మర్దిని

## రూపంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి...





గడివేముల: మండల కేంద్రం గడివేములలోని స్థానిక అమ్మవారి శాలలో సోమవారం నాడు శ్రీమత్ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహిషాసుర మర్దిని అమ్మవారి రూపంలో దర్శనమిచ్చారు. ఆశ్వీజ శుద్ధ నవమి సోమవారం ఉత్తరాషాఢ నక్షత్రం నందు శ్రీ మహిషాసుర మర్దిని దేవి అమ్మవారికి కుంకుమార్చన మరియు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత హోమం, మహా మంగళహారతి తీర్థప్రసాధన కార్యక్రమం నిర్వహించారు.ఆల అర్చకులు వసంతలక్ష్మి మాట్లాడుతూ మహర్నవమి రోజు మహిషాసుర మర్దిని అమ్మవారిని అపరాజితగా పూజిస్తారన్నారు. ఈ అలంకారంలో అమ్మవారిని పూజిస్తే భయాలు తొలగి శత్రువులపై విజయం సాధిస్తారని విశ్వాసం అన్నారు.ఈ కార్యక్రమంలో గడివేముల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన గుప్తా, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు,ఆర్యవైశ్య సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన పలువురు వైసీపీ నాయకులు

**.. పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపు**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరంలో తెలుగుదేశం పార్టీకి మద్దతు పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు టీడీపీకి మద్దతుగా నిలుస్తున్నారు. నగరంలోని 8వ వార్డుకు చెందిన షేక్ షా, నజీర్‌లు వైఎస్సార్‌సీపీని వీడి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో 8వ వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి షేక్ నిలోఫర్ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు. అలాగే కర్నూలు నగరంలోని ధర్మపేటకు చెందిన వీరేష్ తన అనుచరులతో కలిసి మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మపేటకు చెందిన టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి సురేంద్ర గెలుపు కోసం తన అనుచరులతో కలిసి కృషి చేయాలని మంత్రి.. వీరేష్‌కు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కర్నూలు నగర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ, ప్రజల ఆదరణతో ఎన్నికల్లో విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిశెట్టి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి ...

# కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

- బన్ని ఉత్సవం సంప్రదాయానికి ప్రతీక.. కర్రలతో హింసకు పాల్పడవద్దు.
- ప్రతి ఒక్కరికీ కుటుంబం, భార్యాపిల్లలు ఉంటారు. హింసకు పాల్పడి వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టవద్దు.
- అక్రమ మద్యం, నాటుసారా నియంత్రణకు కఠిన చర్యలు.. 190 మందిపై బైండోవర్ చర్యలు.
- 40 కార్డన్ సెర్చ్ ఆపరేషన్లలో 300 కర్రలు స్వాధీనం.
- 50 లీటర్ల అక్రమ మద్యం, నాటుసారా స్వాధీనం.. 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం.
- సోషల్ మీడియా, ప్రత్యేక వీడియోల ద్వారా ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సులు.
- 5 చెక్‌పోస్టులు, 10 పోలీసు పికెట్ల ఏర్పాటు.. విస్తృత తనిఖీలు.
- 110 నైట్ విజన్ సీసీ కెమెరాలు, 700 ఎల్ఈడీ లైట్లు, 10 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా.
- అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సహా మొత్తం 1,000 మంది పోలీసులతో పటిష్ట భద్రత.
- చిన్నపిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.





పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 21వ తేదీ (బుధవారం) రాత్రి హోళగుంద మండలం దేవరగట్టులో నిర్వహించే శ్రీ మాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని సంప్రదాయ సంబరంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సోమవారం జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సహా మొత్తం 1,000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బన్ని ఉత్సవం సంప్రదాయబద్ధమైన వేడుక అని, దీనిని కర్రలతో పరస్పరం దాడులు చేసుకునే కార్యక్రమంగా భావించకూడదని ఎస్పీ స్పష్టం చేశారు.దేవుని ముందు నాట్యం, విన్యాసాలు చేసే సంప్రదాయంలో కొందరు వ్యక్తులు మనస్పర్థలు, పాత కక్షల కారణంగా కర్రలతో దాడులకు పాల్పడి గాయాలపాలవుతున్నారని తెలిపారు. ఉత్సవం ముసుగులో ఇతరుల తలలకు గాయాలు చేయడం, హింసకు పాల్పడటం వంటివి చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

జిల్లా కలెక్టర్ తో కలిసి కర్నూలు కలెక్టరేట్‌లో, దేవరగట్టులో రెండు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి ఉత్సవ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్షించినట్లు తెలిపారు.పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో దేవరగట్టు పరిసర గ్రామాలైన నెరణికి, నెరణికి తాండ, కొత్తపేట, అరికెర, ఎల్లార్తి తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించామన్నారు.గతంలో ఘర్షణలకు పాల్పడినవారిని, అక్రమ మద్యం, నాటుసారా విక్రయదారులను గుర్తించి 190 మందిపై బైండోవర్ చర్యలు తీసుకున్నామన్నారు .దాడుల్లో 40 లీటర్ల నాటుసారా, 10 లీటర్ల అక్రమ మద్యం కలిపి మొత్తం 50 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు.అలాగే నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉత్సవం సందర్భంగా అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు జరగకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.దేవరగట్టు పరిసర గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించిన 40 కార్డన్ సెర్చ్ ఆపరేషన్లలో భాగంగా సుమారు 300 కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.ఉత్సవంలో ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.సోషల్ మీడియా ద్వారా విస్తృత అవగాహన

ఉత్సవంలో హింసకు దూరంగా ఉండాలని ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సోషల్ మీడియా సహకారంతో ప్రత్యేక అవగాహన వీడియోలను రూపొందించి ప్రచారం చేశామన్నారు.దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో 5 చెక్‌పోస్టులు, 10 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్సవ ప్రాంతంలో 110 నైట్ విజన్ సీసీ కెమెరాలు, 700 ఎల్ఈడీ లైట్లు, 10 డ్రోన్ కెమెరాలతో పాటు కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.ప్రతి ఒక్కరికీ కుటుంబం, భార్యాపిల్లలు ఉంటారని గుర్తుంచుకొని హింసకు పాల్పడవద్దని, పాత కక్షలు, వ్యక్తిగత వివాదాలు, గ్రామాల మధ్య విభేదాలకు తావివ్వవద్దని ఎస్పీ సూచించారు.ఉత్సవానికి వచ్చే చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లు, దాడులకు పాల్పడితే కేసుల నమోదు, అరెస్టులు సహా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, భక్తులు, నిర్వాహకులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సిద్ధం కావాలి: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి..



పాణ్యం అక్టోబర్ 19 పల్లె వెలుగు : మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రం అభివృద్ధి,సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమికి మద్దతు తెలుపుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలని, నామినేషన్ పత్రాలను చించివేయడం వంటి ఘటనలకు తావివ్వకూడదని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయితే కేంద్రం నుంచి 16వ ఆర్థిక సంఘం ద్వారా సుమారు రూ.12 వేల కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉందని ఆమె వెల్లడించారు. అన్ని స్థానిక ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయరామిరెడ్డి గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

# బనగానపల్లెలో ఎన్నికల సమరానికి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వ్యూహరచన!

● గెలుపు గుర్రాల ఎంపికపై నాలుగు రోజులుగా కసరత్తు.. క్షేత్రస్థాయి అభిప్రాయాలకే ప్రాధాన్యం ● నాయకులు, కార్యకర్తలతో వరుస సమావేశాలు.. ● అన్ని స్థానాల్లోనూ కూటమి విజయమే లక్ష్యంగా పావులు..



బనగానపల్లె, అక్టోబర్ 19,పల్లెవెలుగు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బనగానపల్లె నియోజకవర్గంలో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నాలుగు రోజులుగా నియోజకవర్గంలోనే ఉంటూ అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో టీడీపీ తరపున పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు విస్తృత కసరత్తు చేపట్టారు. ప్రతి స్థానంలోనూ పార్టీ బలాబలాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల ప్రజాదరణను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

**అభ్యర్థుల ఎంపికలో కొత్త పంథా..**

అభ్యర్థుల ఎంపికలో ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా, క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వడం ఈ కసరత్తులో ప్రత్యేకతగా నిలుస్తోంది. మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ స్థానిక పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండటం, ప్రజాదరణ, పార్టీ కోసం చేసిన కృషి, ఎన్నికల్లో గెలిచే అవకాశాలు వంటి అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. కేవలం అభ్యర్థుల ఎంపికకే పరిమితం కాకుండా, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా ఎన్నికల నాటికి పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేయడంపై దృష్టి సారిస్తున్నారు.

**గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి స్థానాన్ని కీలకంగా భావిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.. గెలుపు అవకాశాలున్న అభ్యర్థులను బరిలోకి దించడమే లక్ష్యంగా వ్యూహరచన చేస్తున్నారు. నాయకులు, కార్యకర్తల నుంచి అందుతున్న అభిప్రాయాలను క్రోడీకరిస్తూ, క్షేత్రస్థాయి పరిస్థితులను విశ్లేషిస్తూ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ముందుకు తీసుకెళు_న్నారు. నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారన్న మంత్రి ధీమా వెనుక క్షేత్రస్థాయి సమీకరణాలపై ఆయన చేస్తున్న కసరత్తు స్పష్టంగా కనిపిస్తోంది.

**అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ప్రచారాస్త్రాలు..**

స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ మంత్రి నిర్వహిస్తున్న సమావేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూనే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బనగానపల్లె నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలే ఎన్నికల్లో పార్టీకి ప్రధాన బలంగా నిలుస్తాయన్న భావనతో ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నారు.

**శాశ్వత అభివృద్ధిపై నమ్మకమే బలమా?**

బనగానపల్లె నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేశామని, గతంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పదే పదే చెబుతుంటారు. ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ఎన్నికల బరిలోకి దిగేందుకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. ప్రజల మద్దతును ఓట్లుగా మలుచుకునే దిశగా అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార నిర్వహణ వరకు ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలిస్తున్నారు.

**విజయ పరంపర కొనసాగించడమే లక్ష్యం..**

మొత్తంగా బనగానపల్లె నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముందస్తు వ్యూహంతో సిద్ధమవుతున్నారు. అభ్యర్థుల ఎంపికలో స్థానిక అభిప్రాయాలకు ప్రాధాన్యం, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం, అభివృద్ధి--సంక్షేమ కార్యక్రమాల ప్రచారం అనే మూడు అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్న లక్ష్యంతో సాగుతున్న ఈ కసరత్తు ఎన్నికల ఫలితాలపై సానుకూల ప్రభావం చూపనుంది.

# రుద్రవరంలో ఘనంగా మహానవమి.

**శ్రీ వాసవీ దేవిగా అమ్మవారి దర్శనం. వైభవంగా మహా చండీ హోమం.**

రుద్రవరం. పల్లె వెలుగు : మండల కేంద్రం





రుద్రవరంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకుని అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మహానవమి (సోమవారం) పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన 'శ్రీ వాసవీ దేవి' అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. అహింస, శాంతి, ధర్మ రక్షణలకు ప్రతిరూపమైన వాసవీ మాతను పూజిస్తే కుటుంబంలో సుఖశాంతులు, సకల శుభాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. తెలుగునాట నవరాత్రి ఉత్సవాలలో మహానవమికి ఎంతో విశిష్టత ఉంది; ఈ రోజున అమ్మవారిని ఉగ్రరూపంలో మరియు శాంతరూపంలో ఆరాధించి హోమాలు చేయడం వల్ల అరిష్టాలు తొలగిపోయి అఖండ విజయాలు కలుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో పండితులు 'మహా చండీ హోమం' అత్యంత శాస్త్రోక్తంగా జరిపారు. సాధారణంగా ఈ మహా చండీ హోమానికి ముందుగా.. ఎటువంటి విఘ్నాలు కలగకూడదని 'మహా గణపతి హోమం', గ్రహ దోషాల నివారణకు 'నవగ్రహ హోమం', అలాగే 'రుద్ర హోమం' వంటివి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆ తర్వాతే చండీ హోమాన్ని పూర్ణాహుతితో ముగించారు. సాయంత్రం వేళ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని లలితా సహస్రనామ కుంకుమార్చనలు, మహా మంగళహారతి కార్యక్రమాలు జరిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు

# జిల్లా పరిషత్ చైర్మన్ బిసి రాజారెడ్డికి ఇవ్వాల్సిందే: బచ్చు శరత్ చంద్రకుమార్, భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి



బనగానపల్లె, అక్టోబర్ 19,పల్లెవెలుగు ప్రజాసేవే పరమావధిగా భావించి నిరంతరం ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి కి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఇవ్వాలని ... ఆ పదవికి ఆయనే అన్ని విధాల అర్హుడని భారతీయ జనతా పార్టీ కార్యదర్శి బచ్చు శరత్ చంద్ర కుమార్ కోరారు. జిల్లాల విభజన తర్వాత నంద్యాల జిల్లా పరిషత్ కు మొట్టమొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో నంద్యాల జిల్లా అన్ రిజర్వ్ అయిందని, జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి బిసి రాజారెడ్డి యొక్క నాయకత్వాన్ని అందరూ సమిష్టిగా బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2001 నుండి 2005 వరకు సర్పంచ్ గా బిసి రాజారెడ్డి పనిచేసిన సమయంలో బనగానపల్లె పట్టణ రూపురేఖలు మార్చిన ఘనత ఒక బిసి రాజారెడ్డి కే దక్కిందన్నారు. అభివృద్ధి అంటే బిసి రాజారెడ్డి ... బిసి రాజారెడ్డి అంటే అభివృద్ధి అని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. టిడిపి పార్టీకి బనగానపల్లెలో పునాది వేసింది బీసీ రాజారెడ్డి అన్నది జగమెరిగిన సత్యం అన్నారు. సొంత పొలాన్ని బీడు పెట్టి బనగానపల్లె పట్టణకు ప్రజలకు తాగునీరు అందించి దాహార్తి తీర్చిన జలదాత బిసి రాజారెడ్డి అన్న విషయం చిన్న పిల్లవాడిని అడిగిన బనగానపల్లెలో చెబుతారు అన్నది అక్షర సత్యం. దేశ, రాష్ట్ర రాజకీయ చరిత్రలో సొంత డబ్బుతో సేవ చేస్తున్న నాయకుడు ఒక్కరూ లేరని , సంపాదించిన సొమ్ములో 99 పైసలు ప్రజాసేవకే ఖర్చు పెడుతున్న ఒకే ఒక్క నాయకుడు బిసి రాజారెడ్డి అన్నది ప్రజలందరికీ తెలుసు ... అటువంటి నాయకుడిని జెడ్పీ చైర్మన్ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది .. జిల్లా పరిషత్ చైర్మన్ గా బిసి రాజారెడ్డి జిల్లా ప్రజలందరికీ న్యాయం చేస్తారని మాకు సంపూర్ణ నమ్మకం ఉంది. అందరం కలిసి బిసి రాజారెడ్డికి జై కొడదాం... బిసి రాజా రెడ్డి గారిని జిల్లా పరిషత్ చైర్మన్ గా గెలిపిద్దాం...

# సిద్ధిధాత్రి అలంకరణలో చౌడేశ్వరి దేవి




బనగానపల్లె, అక్టోబర్ 19, పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సిద్ధిధాత్రి అలంకరణలో చౌడేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 9వ రోజు అమ్మవారు సిద్ధిధాత్రి అలంకరణలో భక్తుల పూజలు అందుకున్నారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు .సాయంత్రం ప్రకార రథోత్సవం నిర్వహించారు. భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఎన్. శ్రీనివాస రెడ్డి , ఆలయ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి , ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి. కుమార్ రెడ్డి పర్యవేక్షించారు.

## ఎన్నికలనిబంధనలుఉల్లంఘించకుండాప్రతి ఒక్కరూ పాటించాలి.

-రిటర్నింగ్ అధికారి నాగరాజు

దొర్నిపాడు అక్టోబర్ 19 పల్లె వెలుగు న్యూస్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ ఓ



నాగరాజు మండలకేంద్రమైనదొర్నిపాడు ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారంవివిధపార్టీలరాజకీయనాయకుల ప్రతినిధులతో ఎన్నికల నియమ నిబంధనలపై మండల రిటర్నింగ్ అధికారి నాగరాజు అధ్యక్షతన ఎంపీడీవో సావిత్రి సమావేశం ఏర్పాటు చేశారు ,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఎన్నికలనిబంధనలనుఉల్లంఘించకుండా ప్రతి ఒక్కరూ పాటించాలని స్థానిక సంస్థల ఎన్నికల మండల రిటర్నింగ్ అధికారి నాగరాజు సూచించారు.ఎన్నికలసమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యతగా వ్యవహారించలన్నారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోని ప్రశాంత ఓటుకు ఆవకాశం కల్పించాలన్నారు. 21 నుంచి 23 నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుందన్నారు. నవంబర్3ఎన్నికలు. 5నఫలితాలు వెలుబడతాయన్నారు. ప్రజాప్రతినిధులుఅధికారులు సమన్వయంతోపనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, తహసీల్దార్ సుభద్ర రాజకీయ పార్టీ నాయకులు కార్యాలయసిబ్బందిపాల్గొన్నారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి, అధికారి..



పాణ్యం అక్టోబర్ 19 పల్లె వెలుగు : మండలంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ఆలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్‌వీఎస్ఎస్ మిథున్ తేజ్, ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు విద్యా సహాయ సంచాలకులు దుర్గా ప్రసాద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సురేష్ స్వామి, సిబ్బంది వారికి శాలువాలు, పూలమాలలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఆదోని మున్సిపల్ వాటర్ ట్యాంక్‌లో ఘనంగా ఆయుధ పూజలు.

**ఎలక్ట్రికల్ సిబ్బందికి పనిముట్ల పంపిణీ.. పట్టణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు.**



ఆదోని (పల్లె వెలుగు): దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదోని మున్సిపల్ వాటర్ ట్యాంక్‌లో సోమవారం డి.ఈ. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి ఆయుధ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ, డి.ఈ.లు రామమూర్తి, వెంకట చలపతి, రాజశేఖర్ రెడ్డి, ఏ.ఈ.లు భువనచంద్ర రెడ్డి, రఘు, పావని, ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్ల ఇన్‌చార్జి అహ్మద్ హుస్సేన్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఈరన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ వలి, ఫిట్టర్లు వీరేష్, మల్లికార్జున, రామాంజి, వాటర్ టెస్టింగ్ సిబ్బంది ఎం. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ చేతుల మీదుగా ఎలక్ట్రికల్ సిబ్బందికి అవసరమైన పనిముట్లను పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలను అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా ఆదోని పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని అధికారులు ఆకాంక్షించారు.



## ఎంపీటీసీ జడ్పిటిసి నామినేషన్ల సామాగ్రి సిద్ధం.



రుద్రవరం. పల్లె వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎంపీటీసీ జడ్పిటిసి నామినేషన్ల సామాగ్రి సిద్ధం చేసినట్లు మండల ఎన్నికల అధికారి ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. రుద్రవరం మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలు 1 జడ్పిటిసి స్థానానికి ఈనెల 21వ తేదీ నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని ఇందుకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి సిద్ధం చేశామని ఆమె తెలిపారు. జిల్లా కేంద్రం నుండి వచ్చిన ఎన్నికల సామాగ్రిని ఎంపిటిసిల వారిగా సిబ్బంది సిద్ధం చేశారన్నారు. ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ వేసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లు బాలాంజనేయులు, ప్రసాద్ రెడ్డి, ఏవో సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగేలా సహకరించాలి

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలంలో త్వరలో నిర్వహించనున్న ఎంపీటీసీ



జడ్పిటిసి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఆయా పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏడిఏ డాక్టర్ మనోరంజన్ ప్రతాప్, ఎన్నికల అధికారి ఎంపీడీవో భాగ్యలక్ష్మి ఆయా పార్టీల ప్రతినిధులను కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఎన్నికల నిర్వహణపై ఆయా పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారులు సమావేశం నిర్వహించారు. ఈనెల 21వ తేదీ నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, నవంబర్ మూడో తేదీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించి గ్రామాలలో ఆయా పార్టీల తరఫున పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఆయా పార్టీల ప్రతినిధులు ఎన్నికల షెడ్యూల్ మరియు నిబంధనలను గమనించి గ్రామాలలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఎన్నికల అధికారి కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, ఏవో సుబ్రహ్మణ్యం, టిడిపి జనసేన వైసిపి నాయకులు, కార్యకర్తలు, పోలీసులు పాల్గొన్నారు.

## వక్కి లేరు వాగులో ప్రమాదవశాత్తు పడ్డ ట్రాక్టర్.

రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని చిలకలూరు గ్రామ సమీపంలో ఉన్న వక్కిలేరు





వాగులో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు పడటంతో డ్రైవర్ చాకచకంగా బయటకు దూకడంతో ప్రమాదం తప్పింది. సోమవారం బత్తలూరు గ్రామానికి చెందిన వ్యక్తి చిలకలూరు వక్కిలేరు వాగులో ట్రాక్టర్ శుభ్రం చేసుకోవడానికి వచ్చి అనుకోకుండా అదే వాగులో ఉన్న గుంతలో ట్రాక్టర్ బోల్తా పడుతున్న సమయంలో డ్రైవర్ పక్కకు దూకడంతో డ్రైవర్ ప్రమాదం నుండి బయటపడ్డారు. అనంతరం గ్రామస్తుల సహాయంతో వాగులో ఉన్న ట్రాక్టర్ ను జెసిబి తో బయటికి తీశారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ ఊపిరి పిలుచుకున్నారన్నారు.

## వైసీపీ అభ్యర్థుల విజయం తధ్యం -మాజీ ఎమ్మెల్యే కాటసాని





బనగానపల్లె, అక్టోబర్ 19, పల్లెవెలుగు ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత ఉందని స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి విజయం తధ్యమని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థుల ఎంపికపై బనగానపల్లె పట్టణ వైసీపీ నాయకులు కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉందని ఓడిపోతామనే భయంతో కూటమి నాయకులు వైసిపి అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా పోలీసులను అడ్డం పెట్టుకొని దౌర్జన్యాలు, ఘర్షణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పట్టణంలోని అన్ని ఎంపీటీసీ స్థానాలను వైసిపి పార్టీ కైవాసం చేసుకుంటుంది అని అన్నారు . నామినేషన్ల సమయంలో అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని నాయకులు కార్యకర్తలు కృషి చేస్తే అన్ని స్థానాలలో విజయం సాధిస్తామన్నారు ఈ కార్యక్రమంలో వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షులు అబ్దుల్ ఖైర్, జిల్లా అధికార ప్రతినిధి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి ,పట్టణ అధ్యక్షులు అబ్దుల్ ఫైజ్, నాయకులు కుమ్మరి సురేష్ బాబు, జి.టి. వెంకటరామిరెడ్డి, దేవుడు గౌడ్, గౌండ నాగరాజు, నీలి శ్రీనివాసులు, యూనుస్,అల్లి హుస్సేన్,కిషోర్, ముక్తియార్, గౌండా వలి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరులో 44 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి దిశానిర్దేశం,,,,,

ప్రజల్లోకి వెళ్లండి. సంక్షేమ పాలనను వివరించండి.,,,,,
ప్రజా సమస్యలపై గళమెత్తండి అభ్యర్థులకు రాజీవ్ రెడ్డి పిలుపు,,,,,






ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 19 ఎమ్మిగనూరు పట్టణంలో రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాచరణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఎమ్మిగనూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కే. చెన్నకేశవ రెడ్డి నివాసంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి అధ్యక్షతన పట్టణంలో పోటీ చేస్తున్న 44 మంది పార్టీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించి, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారు మాట్లాడుతూ, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటి ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అభ్యర్థులకు సూచించారు. ప్రతి వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలవాలని, వారి సమస్యలను తెలుసుకోవాలని, గత ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

అదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు కారణంగా సామాన్య ప్రజలు, మధ్యతరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక భారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పెరుగుతున్న ధరలతో కుటుంబ బడ్జెట్లు ఎలా ప్రభావితమవుతున్నాయో ప్రజలతో చర్చించాలని, ప్రజా సమస్యలను సంబంధిత అంశాలతో వివరించాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.

ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి ప్రజలకు అందుబాటులో ఉండాలని, వార్డుల వారీగా స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో బలమైన సంబంధాలు ఏర్పరచుకోవాలని సూచించారు.

ప్రజల సమస్యలే ప్రధాన అజెండాగా సంక్షేమ పథకాలే చర్చనీయాంశంగా. ప్రతి వార్డులో ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని రాజీవ్ రెడ్డి అభ్యర్థులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి , రాష్ట్ర ఎస్ఈసీ సభ్యులు శ్రీ బనవాసి బసి రెడ్డి పాల్గొని అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణ, ప్రజలతో సమన్వయం, పార్టీ కార్యక్రమాల అమలుపై పలు సూచనలు చేశారు. 44 మంది అభ్యర్థులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు







బేతంచెర్లపల్లెవెలుగు ప్రతినిధి అక్టోబర్ 19:- మండల పరిధిలోని ఆర్.ఎస్. రంగాపురం సమీపంలో ఉన్న ప్రముఖ వైష్ణవ క్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి.

ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు (19-10-2026) శ్రీ మహాలక్ష్మి అమ్మవారు శ్రీ మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఈ సందర్భంగా అమ్మవారికి చతుస్థానార్చన, మూలమూర్తికి విశేష తిరుమంజనం, అర్చనారాధన, వేదపారాయణం, మూలమంత్ర పఠనం, శ్రీ సూక్త హవనం, సహస్ర దీపాలంకరణ సేవ, లలితా సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు.

దసరా ఉత్సవాల సందర్భంగా సంప్రదాయ పట్టు వస్త్రాలు, చీర, సారెలను అమ్మవారికి అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలతో అలంకరించి ఉత్సవ మూర్తిని ప్రత్యేక వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

ఈ కార్యక్రమాలు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ వి. ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో జరిగాయి. ధర్మకర్తల మండలి సభ్యులు, వేద పండితులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## నన్నూరు లో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ: వైఎస్సార్‌సీపీలోకి భారీ చేరికలు

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనే శరణ్యం: చేరికల వేళ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ధ్వజం
పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే
నన్నూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఉత్సాహం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఓర్వకల్లు మండలంలో నన్నూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీకి భారీ రాజకీయ షాక్ తగిలింది. మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో టీడీపీ పునాదులు కదిలాయి. ప్రజా వ్యతిరేక విధానాలు, పార్టీ వైఖరితో విసిగిపోయిన టీడీపీ కీలక నాయకులు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నన్నూరు మాజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ జాకీర్ హుస్సేన్, ప్రముఖ నాయకుడు కె. సాయి తమ అనుచరగణంతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు.

నన్నూరు గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో.. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీలోకి చేరిన జాకీర్ హుస్సేన్, కె. సాయిలకు ఆయన వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజా పక్షాన నిలిచేందుకే వైఎస్సార్‌సీపీ: కాటసాని

ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రసంగిస్తూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వం, ఆయన అందించిన సంక్షేమ పథకాలే నేడు ప్రజల గుండెల్లో నిలిచాయని కొనియాడారు. టీడీపీ మోసపూరిత వైఖరిని ప్రజలు, నాయకులు గ్రహించారని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ వైపు ప్రజా ప్రవాహం మొదలైందని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను, నాయకుడిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమం కోసం, పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో, నిబద్ధతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ తిప్పన్న, హైందవ యూత్ సభ్యులు, నన్నూరు గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామంలో చేరికల పర్వంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది.

# ఎన్నికల నిబంధనలు,

## చట్టాలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించాలి.

**● నామినేషన్ల స్వీకరణ, పరిశీలనలో నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి. ● ఎన్నికల నిర్వహణలో సమన్వయం, సమయపాలన అత్యంత కీలకం. ● మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. సోమవారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన అధికారులు, నామినేషన్ల స్వీకరణ బాధ్యతలు నిర్వహించే సిబ్బందికి నామినేషన్ల దాఖలు, స్వీకరణ, పరిశీలన ప్రక్రియలపై మాస్టర్ ట్రైనర్లు సమగ్ర శిక్షణ అందించి, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి ఎన్నికల చట్టాలు, నిబంధనలు, స్టాట్యూటరీ ఫారాలు, సంబంధిత మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

**అఫిడవిట్ల పరిశీలనలో నిబంధనలే ప్రామాణికం**

నామినేషన్లతో పాటు సమర్పించే అఫిడవిట్లలో అన్ని కాలమ్‌లను అభ్యర్థులు పూర్తిగా నింపేలా పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అఫిడవిట్ల పరిశీలన సమయంలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా తనిఖీ చేస్తూ, చట్టబద్ధమైన నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు సమర్పించే వివరాలు, పత్రాల చెల్లుబాటును

వర్తించే ఎన్నికల చట్టాలు, నిబంధనల ప్రకారం





నిర్ధారించాలని, ఏకపక్ష నిర్ణయాలకు తావివ్వరాదని సూచించారు.

**సమన్వయంతో పనిచేసి ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి**

ఎన్నికల విధులు బాధ్యతతో కూడుకున్నవని, అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ సంయమనం పాటించాలని, ఎవరైనా ఇబ్బందులు కలిగించినా సహనం కోల్పోకుండా, వివాదాలకు తావివ్వకుండా విధులను పూర్తి చేయాలని సూచించారు.

**సమయపాలనతో ఎన్నికల సామగ్రి పంపిణీకి సిద్ధం కావాలి**

శిక్షణ అనంతరం సంబంధిత అధికారులు నిర్ణీత సమయానికి పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని, ఎన్నికల సామగ్రి పంపిణీకి ముందస్తు ప్రణాళికతో

సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సామగ్రిని ముందుగానే సక్రమంగా విభజించి, అవసరమైన వివరాలను తనిఖీ చేసుకోవాలని, సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

**ఓటర్ల జాబితాలు, ఎన్నికల వివరాల నవీకరణపై ప్రత్యేక దృష్టి**

ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది, కౌంటింగ్ టేబుళ్లు, సంబంధిత ఎన్నికల అధికారుల వివరాల్లో మార్పులు చోటుచేసుకుంటే వాటిని ఎప్పటికప్పుడు సరిచూసుకుని నవీకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందస్తుగా ధృవీకరించుకోవాలని, విధుల కేటాయింపు నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ వరకు అన్ని దశల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు అందించే శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకుని, తమకు అప్పగించిన బాధ్యతలపై సంపూర్ణ అవగాహనతో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

## శ్రీ కామేశ్వరి అమ్మవారికి బంగారు కళ్లు

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన కామేశ్వరీదేవి అమ్మవారికి



హైదరాబాద్ కు చెందిన దాతలు ప్రెక్కి శ్రీనివాస సుధాకర్, మీనాక్షి దంపతులు బంగారు నేత్రాలు విరాళంగా అందజేశారు. సోమవారం మహానందిలో స్వామి అమ్మవార్ల దైవ దర్శనార్థం వచ్చారు. అనంతరం రూ.1.50 లక్షల విలువగల బంగారు కళ్లను ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు, ఆలయ ప్రధానార్చకులు అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధానిలకు భక్తితో సమర్పించారు. అధికారులు దాతలను అభినందించారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమాచారం కేవలం మూడు పత్రికలకేనా? - ఎంపీడీవో వ్యాఖ్యలపై విమర్శలు

బేతంచెర్ల పల్లెవెలుగు అక్టోబర్ 16:- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో బేతంచెర్ల



మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఎంపీడీవో ఫజల్ రహిమాన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల నియమ నిబంధనలను వివరిస్తూ మూడు ప్రధాన పత్రికలకే సహకరిస్తామని, మిగిలిన పత్రికలకు సహకరించబోమన్నట్లుగా వ్యాఖ్యానించినట్లు సమావేశానికి హాజరైన నాయకులు తెలిపారు.ప్రభుత్వ కార్యక్రమాలు, ఎన్నికల సమాచారం ప్రజలకు చేరవేయడంలో అన్ని పత్రికల విలేకరులు కీలక పాత్ర పోషిస్తారు. అలాంటప్పుడు సమాచార పంపిణీలో పత్రికల మధ్య వ్యత్యాసం చూపడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో సమాచారం అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాలని విలేకరులు, రాజకీయ వర్గాలు కోరుతున్నాయి.

## రావణ వాహనంపై సిద్ధిదాత్రి దుర్గగా శ్రీ కామేశ్వరి అమ్మవారు

మహానంది, పల్లె వెలుగు మహానంది క్షేత్రంలో మండపంలో సహస్ర దీపాలంకరణ సేవ






దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా 9వ రోజు కు చేరుకున్నాయి. సోమవారం శ్రీలలిత దుర్గ అలంకారంలో శ్రీ కామేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధికారులు, దాతలచే యాగశాలలో హోమం,పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వేద పండితులు, రుత్వికులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కళ్యాణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సమయంలో రావణ వాహనంపై సిద్ధిదాత్రి దుర్గగా శ్రీ కామేశ్వరి అమ్మవారిని అలంకరించి మాడవీధుల వెంట గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు, సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.



## 11 స్థానాలు మనవే!

### ఎంపీటీసీ అభ్యర్థులు సైతం కర్ణాటకకు!

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 19: బండి ఆత్మకూరు మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలలో 11 స్థానాలు మనమే దక్కించుకుంటామని శ్రీశైల మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. సోమవారం రాత్రి నంద్యాలలో బండి ఆత్మకూరు మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసి సభ్యులు అనుబంధ సంస్థలు, గ్రామస్థాయి మండల స్థాయి నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ మండలంలో మూడు ఎంపీటీ స్థానాలు మినహా 11 స్థానాలను మనమే దక్కించుకుంటామని కార్యకర్తలతో పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. మండలంలోని మూడు ఎంపీటీ స్థానాలలు మనకు అనుకూలంగా లేవని సమావేశంలో మాట్లాడినట్లుగా ప్రచారం జరుగుతూ ఉంది. మండల పరిషత్తు అధ్యక్ష స్థానానికి సంబంధించి సంత జుటూరు ,పార్నపల్లె గ్రామాలలో అభ్యర్థులను రంగంలోకి దించాలని రాజకీయ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆత్మకూరు మునిసిపాలిటీకి సంబంధించి నామినేషన్లు వేసిన కౌన్సిలర్ లను కర్ణాటక కు తరలించిన తరహాలోనే, మండలంలో నామినేషన్లు వేసిన ఎంపిటిసి సభ్యులందరినీ కర్ణాటకకు తరలించాలని నిర్ణయించారని తెరపైకి వచ్చింది. ఆత్మకూరు మునిసిపాలిటీ కి సంబంధించి అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురిచేసి వారికి సంబంధించిన నామినేషన్లను విత్ డ్రా చేస్తారన్న, ఉద్దేశంతో వారిని ఇతర ప్రాంతాలకు తరలించడం జరిగిందని, బండి ఆత్మకూరు మండలంలో ఒక్కొక్క ఎంపిటిసి స్థానానికి ముగ్గురు చొప్పున నామినేషన్లను వెయ్యాలని వైయస్సార్ పార్టీ నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

## పాణ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీలతో సమావేశం




పాణ్యం అక్టోబర్ 19 పల్లె వెలుగు : రెండో సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు--2026 నిర్వహణకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ కమలాకర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

## బేతంచెర్ల అమ్మవారి దండను

### రూ.51 వేలకు దక్కించుకున్న సూర్య బల్లాని దంపతులు

బేతంచెర్ల పల్లెవెలుగు అక్టోబర్ 19:- బేతంచెర్ల పట్టణంలోని అమ్మవారి శాలలో ప్రతి



సంవత్సరం దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లోనే దుర్గాష్టమి రోజున వేసే దండకు ఒక ప్రత్యేక విశిష్టత ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ దండను దక్కించుకోవడానికి పోటీ పడుతుంటారు. అమ్మవారి దండను దక్కించుకుంటే ఆ ఏడాది అంతా శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ సంవత్సరం ఆ పవిత్రమైన దుర్గాష్టమి దండను మన బేతంచెర్లకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మన బల్లాని బ్రాండ్స్ అధినేత సూర్య బల్లాని దంపతులు రూ.51 వేలకు కైవసం చేసుకోవడం జరిగింది సోమ వారం అమ్మవారి శాలలో అయ్యగారి వేద మంత్రోచ్చారణలు, మంగళ ఆశీర్వచనాల మధ్య వేద పండితుల సమక్షంలో సూర్య బల్లాని దంపతులకు అమ్మవారి దండను ఘనంగా అందజేశారు. ఈ సందర్భంగా అయ్యగారు దంపతులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com